పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమ సారథి

# ఆంధ్రశివాజీ పర్వతనేని వీరయ్య చౌదరి


రచన :

## రావినూతల శ్రీరాములు



ఎమెస్కో

# "గాంధీయుగమేగుదెంచె"

**– దామరాజు పుండరీ కాక్షుడు.**

భారతదేశ చరిత్రలో అహింసాయుతంగా సాగిన స్వాతంత్ర్య సమరం ఒక సువర్ణ అధ్యాయం. గాంధీజీ 1915లో దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చాడు. తన గురువైన గోపాల కృష్ణగోఖలే ఆదేశం మేరకు దేశం అంతటా ఏడాది పాటు పర్యటించి ప్రజల నాడి గ్రహించాడు.

1917లో చంపారన్ (బీహారు) 1918లో ఖేడా (గుజరాత్) లలో జరిగిన అహింసాయుత పోరాటాలలో విజయం సాధించడంతో గాంధీజీ జాతీయ స్థాయికి ఎదిగాడు. 1920లో ఆయన కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నికైనాడు.

ఈ కాలంలో బ్రిటీష్ పార్లమెంటును కుదిపివేసిన మూడు మహోజ్జ్వల ఘట్టాలు గుంటూరు జిల్లాలోనే జరగడం గమనార్హం.

అవి :– 1. పల్నాడులో పుల్లరి సత్యాగ్రహం

2. చీరాల, పేరాల మున్సిపాలిటీ బహిష్కరణ

3. పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం

1920లో సహాయనిరాకరణోద్యమం ప్రారంభమయింది. ప్రభుత్వ ఉద్యోగులులో తమ నౌకరీల నుండి వైదొలగాలని, పెద్ద మనుషులు బ్రిటీష్ వారు తమకిచ్చిన బిరుదులు విసర్జించాలని, సంఘసేవకులు కౌన్సిల్ ఎన్నికలు బహిష్కరించాలని విద్యార్థులు సర్కారు బడుల నుండి బయటకు రావాలని ప్రత్యేక కాంగ్రెసు చేసిన తీర్మానాలను 1920 డిసెంబరులో కాంగ్రెసు కమిటీ ధ్రువీకరించింది.

1921 మార్చి 31 ఏప్రిల్ 1న కాంగ్రెసు మహాసభలు ఆంధ్రదేశం నడిబొడ్డున గల బెజవాడలో వైభవంగా జరిగాయి. దేశం నలుమూలల నుండి వేలాది ప్రజానీకం హాజరైనారు.

జాతీయ నాయకులు అనేకులు విచ్చేశారు. మహాత్మాగాంధి ప్రజలకు ప్రత్యక్షదైవమయ్యాడు.

జగద్రక్షకుడు గాంధీమహాత్ముడు
జనులందరు మీరెరుగండీ

లాంటి గేయాలు సభాస్థలిని హోరెత్తించాయి. దేశభక్తి సాహిత్యాన్ని ఆబాలగోపాలం కంఠస్థం చేసి ఆలపించేటట్లు చేసిన గాయక శిఖామణి పెదనందిపాడు రైతు బిడ్డ పర్వతనేని వీరయ్య చౌదరి.

జిల్లాలోని చీరాల పేరాల ఉద్యమాన్ని, పల్నాటి పుల్లరి సత్యాగ్రహాన్ని సన్నిహితంగా గమనించిన వీరయ్య చౌదరి పెదనందిపాడు శిస్తు నిరాకరణోద్యమానికి తానే నాయకుడైనాడు.

# చీరాలలో గవర్నరు ఎవరు?

**వెల్లంగడిన కాదు! దుగ్గిరాల గోపాలకృష్ణయ్య**

నేటి ప్రకాశం జిల్లాలోని చీరాల-పేరాల గ్రామాలు చిరకాలంగా చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి. ఇక్కడి నివాసులు అధికభాగం చేనేతపై ఆధారపడినవారే!

చీరాల-పేరాలలను కలుపుతూ 1920 జనవరి 1న చీరాల మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించింది. పన్నులు 4 వేల నుండి 30 వేలకు పెరిగాయి. ప్రజలు మున్సిపాలిటీ ఏర్పాటును గట్టిగా ప్రతిఘటించారు.

'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అప్పటికే చీరాలలో స్థిరపడి విద్యాగోష్ఠి నెలకొల్పాడు. 'రామదండు' అనే వానరసైన్యం ఏర్పాటు చేశాడు. బెజవాడ కాంగ్రెసు మహాసభల నిర్వహణను రామదండు జయప్రదం చేసింది.

ఆంధ్రదేశంలో పర్యటిస్తూ మహాత్మాగాంధి 1921 ఏప్రిల్ 6న చీరాల విచ్చేశాడు. ఊరి వెలుపల 'రామనగరు' నిర్మాణానికి శంకుస్థాపన చేశాడు.

గాంధీజీతో "ఆంధ్రరత్న" సుదీర్ఘంగా చీరాల సమస్యను గూర్చి చర్చించాడు. చీరాల-పేరాల వీరులు తమ ఇండ్లను విడిచి దూరంగా ఆవాసం ఏర్పాటు చేసికొని మున్సిపాలిటీని బహిష్కరించడమే ఉత్తమ మార్గమని సూచించాడు మహాత్ముడు. చీరాల పట్టణాన్ని ఖాళీ చేయించడానికి "ఆంధ్రరత్న" రామదండును నియోగించాడు.

గతంలో మున్సిపాలిటీకి పన్నులు చెల్లించనిరాకరించిన 12 మంది జైలు శిక్ష అనుభవించారు. వీరందరినీ గాంధీజి సన్మానించాడు. వీరిలో రావూరి అలివేలమ్మ అనే మహిళ కూడా వుంది. ఆంధ్రదేశంలో స్వరాజ్య పోరాటం సందర్భంగా జైలుకు వెళ్లిన తొలి మహిళ ఈమెయే!